# ఇది కథ కాదు

ఆప్పాటి వాసు

నాన్నగారి బలవంతం మీద తప్పనిసరిగా ఆ పల్లెటూర్లో ఉద్యోగంలో జాయిన్ అయాను. పట్నానికి అలవాటుపడ్డ నాకు ఆ పల్లెటూర్లో ఉండడం దుర్భేధ్యం అనిపించసాగింది. అయినా తప్పదు కాబట్టి అలవాటు పడడం నేర్చుకున్నాను.

ఆ రోజు ఆఫీస్ నుండి వస్తుండగా నాకీ అమ్మాయి కన్పించింది. పెద్దగా ఏ అలంకరణలూ లేకపోయినా సంసార పక్షంగా చూడడానికి చాలా ఆకర్షణీయంగా వుంది. కలువరేఖల్లాంటి కళ్ళు, గుండ్రటి ముఖం, శంఖం లాంటి మెడ, ఎత్తయిన వక్షద్వయం, సన్నటి నడుముతో రాజహంసలా నడుస్తూ వస్తున్న ఆమెను చూసేసరికి నాకు మూర్ఛవచ్చినంత పనైంది. ఈ పల్లెటూర్లు కూడా ఇంత అందమైన అమ్మాయిలు వున్నారా అని అన్పించింది. ఎంత ప్రయత్నించినా ఆమె నుండి చూపు మరల్చుకోలేక పోయాను.

ఈలోగా ఆమె కనుమరుగైపోయింది.

★ ★ ★

దసరా సందర్భంగా పాటల పోటీలు నిర్వహించారు. ఏమీ తోచకపోతే నేను కూడా చూడ్డానికి వెళ్ళాను.

పాటల పోటీ మొదలైంది.

వయోభేధం లేకుండా ఆడ, మగ తమకు తెల్సిన (వచ్చిన) పాటలు రాగంతో సంబంధం లేకపోయినా ఆలపించసాగారు.

ఆఖరుగా ఓ అమ్మాయి పంజాబీడ్రెస్ వేసుకొని స్టేజ్ ఎక్కింది.

ప్రేక్షకుల్లో కలవరం మొదలైంది. అందరూ ఒకటే చప్పట్లు. ఈ హడావిడికి పరధ్యాసగా వున్న నేను స్టేజ్ వైపు చూసాను.

అంతే... ఒక్కసారిగా స్థాణువైపోయాను.

నిన్న చీర కట్టుకొని కొండపల్లి బొమ్మలా వున్న ఆమె... ఈ రోజు మోడరన్ డ్రెస్‌లో...

ఎందుకో అప్రయత్నంగా నేను కూడా చప్పట్లు కొట్టాను.

'సూత్రధారులు' చిత్రంలోని ఆమె పాట మొదలైంది.

జోల... జోలమ్మ జోల... శైలజ పాడిన పాట... నాలో అలజడి పెరిగింది.

శ్రావ్యమైన ఆమె కంఠస్వరానికి ఆశ్చర్యపోయాను.

నా మనస్సులో ఆమెను ఆరాధించడం ఆ క్షణం నుండే మొదలుపెట్టాను. ఎలాగైనా ఆమె ప్రేమను పొందాలని నిశ్చయించుకున్నాను. పాట పూర్తయింది. ఈ లోగ మళ్ళీ చప్పట్లతో హాలంతా మారుమ్రోగింది.

ఓ అరగంట తర్వాత...

''ఈ రోజు జరిగిన పాటల పోటీ కార్యక్రమంలో కుమారి మంజులకు ప్రథమ బహుమతి యివ్వడం జరిగింది. ఆమెను వేదికపైకి రావలసిందిగా కోరుతున్నాను'' అంటూ ఆ సభకు ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మహిళామండలి అధ్యక్షుణి మాటలకు వేదికపైకి ఎక్కింది.



ప్రేక్షకులు మళ్ళీ చప్పట్లు కొట్టడం ప్రారంభించారు.

నేనైతే ఆనందం ఆపుకోలేక ఈలవేసి మరీ చప్పట్లు కొట్టాను.

ఆఖరుగా...

కార్యక్రమం పూర్తయిన తర్వాత ఆమె దగ్గరకు వెళ్ళి 'థాంక్స్' చెప్పాను.

ఆమె ఓ సారి నా ముఖంలోకి చూసి ఏ రెస్పాన్స్ యివ్వకుండా వెళ్ళిపోవడంతో నా మనస్సు చివుక్కుమంది.

కానీ నాలో పట్టుదల మాత్రం బాగా పెరిగింది. ఎలాగైనా ఆమె ప్రేమను పొందాలన్న నిశ్చయంతో ఆమె గురించి వివరాలు సేకరించడం మొదలు పెట్టాను.

O O O

ప్రతిరోజూ ఆమె గురించి ఆలోచనలు మొదలైయ్యాయి. కళ్ళుమూసినా, తెరిచినా ఆమె తలపులే. ఆఫీసులో పనిచేస్తున్నా ఆమె రూపమే కన్పించసాగింది. ఎలాగైనా ఆమెకు నా ప్రేమను తెలియజెయ్యాలన్న వుద్దేశ్యంతో సమయం కోసం ఎదురుచూడ సాగాను.

ఆ సమయమే రానే వచ్చింది.

ఆమె ఒంటరిగా రావడం చూసి ఆమె దగ్గరకు వెళ్ళాను. ఆమె కంగారుపడింది. ఎలాగో ధైర్యం తెచ్చుకుని "మంజుల గారు! మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఐ లవ్ యూ... ఐ లవ్ యూ సోమచ్... మీకు నా మీద ప్రేమంటూ వుంటే రేపు ఇదే సమయానికి యిక్కడ కల్సుకుందాం" అని చిన్నపిల్లలు మాస్టారికి పాఠం అప్పచెప్పినట్లు ఆమెకు చెప్పేసి రూమ్‌కు వచ్చేసాను. వచ్చేముందు ఆమె "అన్నట్లు నా పేరు చెప్పలేదు కదూ... మై నేమ్ ఈజ్ వాసు" అని చెప్పేసి మరీ వెనక్కి వచ్చేసాను.

ఆ మర్నాడు నేను చెప్పిన సమయానికి చెప్పిన స్థలం దగ్గర మంజుల నన్ను కల్సింది. ఏం చెప్తుందా అనుకుంటూ ఆలోచిస్తున్న నాకు ఆమె నా చేతిని తన చేతిలోకి సుతారంగా నొక్కి "వాసు... ఐ లవ్ యూ..." అంది.


అంతే... అమాంతం ఆమెను కౌగలించుకొని సుతారంగా ఆమె చేతిని ముద్దు పెట్టుకున్నాను.

అప్పటి నుండి మా ప్రేమ దినదిన ప్రవర్ధమానం చెందసాగింది. ప్రతిరోజు ఏకాంతంగా యిద్దరం కల్సుకొనేవాళ్ళం. ఒకరి ఒళ్ళో ఒకరం పడుకొని ఎన్నో ప్రేమకబుర్లు చెప్పుకొనేవాళ్ళం. ఒక్క క్షణం ఆమెను చూడలేక పోతే నా మనస్సు విలవిల్లాడేది. ఆమె కూడ అంతే. యిద్దరిదీ ఒకటే ప్రాణం అన్నట్లు ఎన్నో గంటలు ఏకాంతంగా గడిపేవాళ్ళం.

'కాని ఓ రోజు ఆమె గురించి ఓ 'నిజం' తెల్సింది. నా ఫ్రెండ్ చెప్పాడు ఆమె గురించి. మొదట నేను నమ్మలేదు. మరికొంత మందిని అడిగాను వాళ్ళు కూడా మా ఫ్రెండ్ చెప్పినట్లే చెప్పారు.

## వర్ష తెగింపు

'మహాభారత్'లో ఉత్తరగా నటించిన వర్షా ఉస్గాంకర్ ఇప్పుడు పాత్రల ఎంపికలో 'మడి' వదులుకుంది. ఎటువంటి పాత్రలో ఎంత చూపించాలన్నా నాకేం అభ్యంతరం లేదంటూ ప్రకటించింది. దాంతో ఒకేసారి ఉత్తరాది నుండి, దక్షిణాది నుండీ అవకాశాల వర్షం ప్రారంభమైంది వర్షపై.



వాళ్ళ మాటలకు నా గుండె పిండేసినట్లు అయింది.

ఒక్కసారిగా భూమి బద్దలై అందులో దిగబడి పోతే బావుణ్ణు అన్పించింది. చాలా అనీజీగా రూమ్‌కి వచ్చేసాను.

ఆమె మీద అంతవరకూ వున్న ప్రేమ పోయి ఆ స్థానంలో ద్వేషం ఏర్పడింది. అప్పటి నుండి ఆమెను తప్పించుకొని తిరగసాగాను.

★ ★ ★

"ఓ రోజు మంజుల నా రూమ్‌కి వచ్చింది... నన్ను చూస్తూనే కళ్ళల్లో నీళ్ళు నింపుకొంది."

"నేను తలవంచుకున్నాను."

"ఎందుకు మీరీ మధ్య నాకు దూరంగా వుంటున్నారు?" నన్ను చూడగానే ఎందుకు తప్పించుకొని తిరుగుతున్నారు? మీరిలా మౌనంగా వుంటే నేను భరించలేను అంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగింది

ఆ ఒక్క క్షణం ఆమె మీద జాలి కలిగినా ఆ నిజం యిన్నాళ్ళు నాకు చెప్పనందుకు ఆమెను ఓదార్చడానికి నా మనసంగీకరించలేదు.

"ఆమె మళ్ళీ నన్ను ప్రశ్నించింది!"

ఆ నిజం అడగాలా? వద్దా? అన్న రెండు నిముషాల గర్షణలో ఆమెను ఆ నిజం గురించి అడగాలనే నిర్ణయించుకున్నాను.

ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ 'మంజూ... నీకిదివరకే పెళ్ళి అయ్యింది కదూ!'' అడిగాను.

ఆమె పలుకలేదు.

ఆమె మౌనం నాలో అశాంతిని రేపింది.

నేను రెట్టించి మరీ అడిగాను. "ఇన్నాళ్ళు ప్రేమ పేరుతో ఎందుకు నన్ను మోసం చేసావు...? ఒకసారి పెళ్ళయిన నువ్వు నన్ను ప్రేమించడాన్కి సిగ్గనిపించ లేదా? నువ్వు ఆడదానివేనా? అంటూ నిలదీసి మరీ అడిగాను.

మంజుల కళ్ళ నుండి కన్నీళ్ళు చెంపల మీదుగా జలజలామని నేలను తాకాయి. ఆమె చెప్పడం మొదలుపెట్టింది.

★ ★ ★

"అప్పుడు నాకు 15 సంవత్సరాలు బాల్యం నుండి యవ్వనంలోకి అడుగు పెట్టాను. అందరితోను సరదాగా వుంటూ ఆడుతూ పాడుతూ సెలయేరులా వుండే నా జీవితంలోకి అకస్మికంగా ఓ వ్యక్తి ప్రవేశించాడు. మా వూళ్ళోనే టీచర్‌గా పనిచేస్తుండేవాడు."

మా యింటికి దగ్గర్లోనే.

నేనడిగిన ప్రశ్నలకు ఎంతో సౌమ్యంగా జవాబులు చెప్పాడు.

"అతని మాట తీరు నాకెంతో నచ్చింది. అలా వారం రోజులు వెళ్ళాను. అప్పటికే అతనంటే నాకు ఓ ప్రత్యేక అభిమానం ఏర్పడింది." నేనెప్పుడైనా వెళ్ళడం ఆలస్యం అయితే "యిప్పుడా రావడం? నీకు లెక్కలు చెప్పను పో" అంటూ చిన్న పిల్లాడిలా మూతి ముడుచుకొని గారాబం చేసేవాడు.

అతన్ని అలా చూస్తే నాకు భలే సరదా అన్పించింది.

అందుకే అతనంటే అభిమానం పెంచుకున్నాను.

కానీ నా అభిమానం నా జీవితాన్ని నాశనం చేస్తుందనిగాని నా బ్రతుకులో పెనుతుఫాను సృష్టిస్తుందని గాని అనుకోలేదు.

ఓ రోజు అతని రూమ్‌లో వుండగా కరెంట్ పోయింది.

యింతలో అతని చెయ్యి నా భుజం మీద పడింది.

నేను భయపడి 'ఏమిటిది?' అని అడిగాను.

అతను జవాబుగా నా పెదవుల్ని తన పెదవుల్తో మూసేసాడు.

అతను చేస్తున్న 'ఆ చర్య' ఏమిటో అర్ధం కాలేదు నాకు అప్పట్లో.

కాని నాకేదో జరిగిందని మాత్రం గ్రహించాను.

ఏడుస్తూ యింటికెళ్ళి అమ్మతో చెప్పాను. అమ్మో యిష్టం వచ్చినట్లు కొట్టింది. అమ్మ ఎందుకు కొట్టిందో, అసలు నా తప్పేంటో అర్థం కాక అమ్మకు వళ్ళు అప్పగించి వూరుకున్నాను.

ఓ వెంరోజుల్లో అతనితో నా పెళ్ళి జరిపించారు.

ఆ తర్వాత మా వూరు వదిలి వెళ్ళిపోయాం. కారణం అతనికి ట్రాన్స్‌ఫర్ అవ్వడం. అక్కడ మా కాపురం మొదలైంది.

ప్రతిరాత్రి నా శరీరాన్ని బలవంతంగా అనుభవించే వాడు.

రాత్రుళ్ళు యింటికి తాగివచ్చి నానా తిట్లు తిట్టే వాడు. ఒక్కోసారి కొట్టేవాడు కూడా.

"ఓ రోజు 50 వేల రూపాయలు కట్నంగా తెస్తేగాని నీతో కాపురం చెయ్యనని అన్నాడు."

నేను తేనని మొండికేసాను.

ఫలితం... నన్ను చంపబోయాడు.

యిక ఆ కిరాతకుడి దగ్గర వుండలేక యింటికి వచ్చేసాను.

కడుపుతీపి చంపుకోలేక అమ్మ నన్ను ప్రేమగానే ఆదరించింది. ఏనాటికైనా అతను మారతాడని, నన్ను తీసుకొని వెళ్ళి ప్రేమగా చూసుకుంటాడన్న నా ఆశ నిరాశే అయింది.

ఈ నా నిరీక్షణలో ఓ సంవత్సరం గడిచింది.

ఓ రోజు అతని దగ్గరనుండి లెటర్ వచ్చింది. తను మరో పెళ్ళి చేసుకుంటున్నానని విడుకులకు సిద్ధం కమ్మని.

అప్పటికే నా బాధలు అర్థం చేసుకున్న అమ్మానాన్నలు నాకు విడాకులు యిప్పించడానికే సిద్ధపడ్డారు.

కాలచక్రంలో మరో సంవత్సరం గడిచింది.

జీవితమంటేనే విరక్తి కలిగింది. బ్రతుకు మీద ఆశపోయింది. జీవితం గురించి ఎన్నో అందమైన కలలు కన్న నాకు భవిష్యత్ గురించి ఆలోచించే మోడుబారిన క్షణంలో మీరు కన్పించారు. తొలిచూపులోనే మీ పట్ల ఆకర్షితురాలి నయ్యాను. మీ పరిచయం, ప్రేమ నాలో మళ్ళీ ఆశలు రేపాయి. మీకు నా గతం ఎన్నో సార్లు చెప్పాలనుకున్నాను. కాని నా గతం విని మీరు నాకు దూరమైతే భరించలేను. మీ అనురాగం, ప్రేమ కరువైననాడు ఈ లోకంలో నేనుండను అంటూ మోకాళ్ళపై తల ఆన్చి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

ఆమె కథ విన్న నాకు కళ్ళు చెమర్చాయి.

నా మనసంతా ఆమెపట్ల జాలితోనిండిపోయింది.

అందమైన ఆమె రూపం, మనసు అడవి కాచిన వెన్నెల కాకూడదు. ఆమె జీవితంలో మళ్ళీ వసంతం కురిపించాలనుకున్నాను.

ఆమె వైపు చూసాను. ఆమె వెక్కివెక్కి ఏడుస్తుంది యింకా.


ఆమె దగ్గరగా వెళ్ళి ప్రేమగా ఆమె కన్నీటిని తుడిచి నా ఎదకు హత్తుకున్నాను.

●



## మహిళా ఓ మహిళా

## అల్లుళ్ళూ! అలకలు మానండి




అల్లుడొస్తున్నాడంటే ఆనందం మాట అటుంచి తెగ గాబరాపడిపోవలసి వస్తోంది నేటి అత్తమామలకు. ఏదో తనకు తోచిన వాటిని ఇచ్చి అల్లుడ్ని తృప్తి పరచలేకపోతున్నారు. అడిగింది ఇవ్వకపోతే కూతుర్ని ఎక్కడ కష్టపెడతాడోనన్న భయం. లక్షలు కట్నం ఇచ్చినా, కూతురి సుఖపడుతుందన్న గ్యారంటీ లేకుండా పోయింది. నేటి మగవాళ్ళ ప్రవర్తనవలన ఏ కిరసనాయిలు డబ్బాకో, ఫేనుకు ఉరో, మరో రూపంలోనో నేటి ఎందరో కోడళ్ళు బలయిపోతున్నారు. డబ్బు, సొమ్ములు, ఫ్రిజ్‌లు, టి.వి., వి.సి.ఆర్.లు పుట్టింటికి పంపించి తీసుకురమ్మనే ఎందరో ప్రబుద్ధులున్న ఈ లోకం ఎప్పటికి మారుతుందో నమ్మకం లేకుండా పోతోంది. తన తల్లి, చెల్లి కూడా ఓ ఇంటికి కోడళ్ళే అని అనుకోరు. చదువుకుని ఉద్యోగం చేసి స్వయంగా సంపాదిస్తున్నా, తేరగా అత్తగారి సొమ్ము దోచుకు తిందాం అనుకునే మగమహారాజులు ఎందరో మనకు ఎదురవుతున్నారు. 'పండక్కి స్కూటర్ ఇస్తేనే వస్తాను, ఫ్రిజ్ తెచ్చిస్తేనే మీ కూతుర్ని ఏలుకుంటాను అని అనే ప్రబుద్ధుడు మరొకడు.

భార్య ద్వారా తనకు సంక్రమించే ఆస్తి తనకు అక్కర్లేదని, ఆత్మాభిమానంగా, మగధీరుడుగా ఎన్నటికి మారుతారు ఈ మహానుభావులు.

తన కాళ్ళమీద నిలబడి తను సంపాదిస్తూ భార్యని, పిల్లల్ని పోషిస్తున్న నిజమైన భర్తకు ఎంతతృప్తి, ఆనందం ఉన్నయో స్వయంగా అనుభవిస్తేనే తెలిసేది. ప్రతి మగవాడు ఇలా ఆలోచించిననాడు ఈ కట్నపు చావులు, ఆత్మహత్యలు ఉండనే ఉండవు.

ఈ వ్యాసం చదివి కొందరైనా మారితే నా వ్యాసానికి ఫలితము దక్కుతుంది, నాకు ఆనందమూ మిగులుతుంది. — ముచ్చర్ల రజనీ శకుంతల




ఇటీవల ఆంధ్రాబ్యాంక్ సీతాఫల్‌మండి (సికింద్రాబాద్) శాఖలో మహిళలు— పొదుపు కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రాబ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీ రఘునాథరావు, సీతాఫల్‌మండి శాఖ మేనేజర్ శ్రీ వై. మహేంద్రనాథ్ తదితరులు.